# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 344 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | బుధవారం 21ఆగస్టు 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## రుణమాఫీ పట్ల .. అలసత్వం వద్దు



- బ్యాంకర్లపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు
- 18 వేల కోట్లు రిలీజ్ చేస్తే.. రైతుకు చేరింది 7,500 కోట్లే
- రైతులకు వీలైనంత త్వరగా తిరిగి రుణాలివ్వాలి
- బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్ పెన్ పవర్:**రుణమాఫీ ఆలస్యమైతే ఫలితం ఉండదని, బ్యాంకర్లు తమ సేవలను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయలు విడుదల చేస్తే రైతులకు ఇప్పటి వరకు చేరింది 7,500 కోట్లు మాత్రమేనని అన్నారు. రుణాలు మాఫీ అయిన రైతులకు వీలైనంత త్వరగా లోన్లు ఇవ్వాలని అన్నారు.

వివరాలు 2లో..


## అధికారం పోయినా బీఆర్ఎస్ నేతలకు
# అహంకారం తగ్గలేదు

### రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామన్న కేటీఆర్‌పై రేవంత్ రెడ్డి మండిపాటు!

### అనవసర ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం బహిష్కరిస్తుందని హెచ్చరిక

### డిసెంబర్ 9 లోపు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ

**హైదరాబాద్ పెన్ పవర్:**సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే... తాము అధికారంలోకి వచ్చాక దానిని తొలగిస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారం పోయినా బీఆర్ఎస్ నేతలకు ఇంకా అహంకారం తగ్గలేదని విమర్శించారు. అనవసర ఆరోపణలు చేస్తే బీఆర్ఎస్ నేతలను తెలంగాణ సమాజం బహిష్కరిస్తుందని హెచ్చరించారు. డిసెంబర్ 9 లోపు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా... సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తదితరులు పంజాగుట్టలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దేశంలో విప్లవాత్మక మార్పులకు రాజీవ్ గాంధీ శ్రీకారం చుట్టారన్నారు. దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన



ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలు రాజీవ్ గాంధీ హయాంలోనే బలోపేతమయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలుగా మార్చుతామని తెలిపారు.

## కవిత బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

కౌంటర్ దాఖలు చేయాలని ఈడీకి ఆదేశం



### ఈడీ కౌంటర్ దాఖలు చేయకపోవడంపై సుప్రీం అసహనం

### ఈ నెల 27వరకు టైం ఇచ్చిన బెంచ్

### 28లోపు రిజాయిండర్ వేయాలని కవిత తరఫు అడ్వొకేట్లకు ఆదేశం


**హైదరాబాద్ పెన్ పవర్:** లిక్కర్ స్కాం కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ విచారణ ఈ నెల 27కు వాయిదా వేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది.

వివరాలు 2లో..

## ఆత్మహత్య అని ఎలా చెప్పారు?..

కోల్ కతా వైద్యురాలి హత్యాచారంపై సుప్రీంకోర్టు

- ఆసుపత్రి సిబ్బంది, పోలీసుల తీరుపై మండిపడ్డ కోర్టు
- ఎఫ్ఐఆర్ నమోదులో అంత జాప్యం ఎందుకు జరిగిందని ప్రశ్న
- బాధితురాలి పేరు, ఫొటో ప్రచురించడంపై మీడియా సంస్థలపై ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్ కతా ఆర్జీ కర్ ఆసుపత్రి వైద్యురాలి హత్యాచారం ఘటనలో ఆసుపత్రి సిబ్బందితో పాటు పోలీసులు, బెంగాల్ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మృతదేహం పడి ఉన్న తీరును చూశాక అది ఆత్మహత్యని

వివరాలు 2లో..

## నా మాటలు గుర్తు పెట్టుకో రేవంత్... అంటూ కేటీఆర్ కౌంటర్

### మేం అధికారంలోకి వచ్చిన రోజునే 'చెత్త'ను తొలగిస్తామని వ్యాఖ్య

### నీలాంటి ఢిల్లీ బానిస తెలంగాణను అర్థం చేసుకోలేరని విమర్శ

### రేవంత్ మానసిక రుగ్మత నుంచి త్వరగా కోలుకోవాలని చురక

**హైదరాబాద్ పెన్ పవర్:**"నా మాటలు గుర్తు పెట్టుకో 'చీప్' మినిస్టర్ రేవంత్... మేం అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే బాబాసాహెబ్ అంబేద్కర్, సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తాం" అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా పంజాగుట్ట వద్ద రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసిన సీఎం రేవంత్ రెడ్డి... కేటీఆర్‌పై

వివరాలు 2లో..



## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** సెక్రటేరియట్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు సీఎం రేవంత్ రెడ్డి. డిసెంబర్ 9వ తేదీ సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని గతంలోనే ప్రకటించారాయన. ఈ మేరకు ఏర్పాటు చేసే స్థలాన్ని స్వయంగా పరిశీలించారు సీఎం రేవంత్. తెలంగాణ తల్లి విగ్రహానికి.. తెలంగాణ అధికార పీఠమైన సెక్రటేరియట్ సముచితమైన స్థానమని.. అక్కడ తెలంగాణ తల్లిని సగర్వంగా, సగౌరవంగా ప్రతిష్ఠిస్తామని ఇప్పటికే చాలామార్లు స్పష్టం చేసిన సీఎం. రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో మరోసారి తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించిన సీఎం..



వివరాలు 2లో..

## మీ అయ్య చారాణా.. నువ్వు బారాణా




- కేటీఆర్ చీప్ లిక్కర్ తాగినోని లెక్క మాట్లాడుతుండు
- టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ మంత్రి కేటీఆర్ చీప్ లిక్కర్ తాగినోడి లాగా మాట్లాడుతున్నాడని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం కూలగొడతామంటే మేం చూస్తు ఊరుకుంటామా అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు కరెక్ట్ మొగుడు, ధగడు, మిండేడు రేవంత్ రెడ్డి అని అన్నారు. జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 'కేటీఆర్..

వివరాలు 2లో..

## బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. దీర్ఘకాలిక ప్రణాళికలతో అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి. 2024, ఆగస్ట్ 20వ తేదీ హైదరాబాద్ సిటీ మాదాపూర్ HICCలో క్రెడాయ్ తెలంగాణ స్టేట్ కాన్ 2024 ప్రారంభంలో మంత్రులు పాల్గొని మాట్లాడారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రెడాయ్ సభ్యులు కాన్ఫరెన్స్ నిర్వహించుకోవడం అభినందించదగ్గ విషయంగా అభివర్ణించారు మంత్రులు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని వెల్లడించారు. క్రెడాయ్ కు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

రెండు మూడు నెలల్లో రేడియల్ రింగ్ రోడ్డు పనులు

వివరాలు 2లో..

## రహస్య ప్రాంతంలో కొనసాగుతున్న వాసుదేవరెడ్డి విచారణ...




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, ఆగస్టు 20:** కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ఇటీవల ఏపీలో అరెస్టుల పర్వం మొదలైంది. జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ను పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. తాజాగా ఏపీ బేవరీజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఏపీ సీఐడీ అధికారులు వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేశారని సమాచారం. ఏపీలో మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించారని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఓ అజ్ఞాత ప్రాంతంలో ఏపీ బేవరీజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీని

వివరాలు 2లో..



## వాగులు కాదు రోడ్లు.. ఇది మన హైదరాబాదే

**హైదరాబాద్ పెన్ పవర్:**వానలొద్దు బాబోయ్.. వానలొద్దు.. ఎలాగోలా బతుకుతాం.. సగటు నగర వాసుల నోటి నుంచి వస్తున్న మాటలివి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు చుక్కలు చూస్తున్నారు. వరద నీరు ఇళ్లలోకి చేరుతుండడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఒకవైపు దుర్వాసన, మరోవైపు నీరు నిల్వ ఉండటంతో తినడానికి వంట కూడా వండుకోలేని పరిస్థితివచ్చిందని వారు వాపోతున్నారు. నగరంలో పలు చోట్ల ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి.అత్యవసరం ఉన్న వారు తప్పనిసరి పరిస్థితులలో వర్షపు నీటిలోనే అడుగులు వేస్తున్నారు. గతంలో మ్యాన్ హోల్స్ తెరిచి ఉండి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు

వివరాలు 2లో..

# సంపాదకీయం

## సవాల్ విసురుతున్న మంకీ పాక్స్

ప్రపంచానికి మంకీపాక్స్ కొత్త సవాల్ విసురుతోంది. ఆఫ్రికా దేశాల్లో హఠాత్తుగా కేసులు పెరిగిపోవడం, మిగిలిన దేశాలకు కూడా ఇది చాపకింద నీరులా వేగంగా వ్యాపిస్తుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. డబ్ల్యూహెచ్ఓ ఈ తరహా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడం రెండేళ్లలో ఇది రెండోసారి. 2022లో కూడా మంకీ పాక్స్‌ను హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్ఓ ప్రకటించింది. ఎం-పాక్స్‌గా పిలిచే మంకీ పాక్స్ వైరస్ ఇతర దేశాలకు కూడా వ్యాపించడంతో అటు ఆఫ్రికా దేశాలతో పాటు ఇటు ప్రపంచ దేశాలు గజగజ వణికిపోతున్నాయి.కరోనా తర్వాత అంతటి రేంజ్ లో భయానకంగా ఈ వ్యాధి మారింది. మంకీపాక్స్ వైరస్ ప్రపంచ దేశాలకు విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా ఆఫ్రికన్ యూనియన్ హెల్త్ ఏజెన్సీ తెలిపిన లెక్కల ప్రకారం జనవరి నుంచి ఆఫ్రికాలో ఎంపాక్స్ కేసులు 18,737కు చేరినట్లు, మృతుల సంఖ్య 541కు చేరినట్లు తెలుస్తోంది. తొలుత ఆఫ్రికాకే పరిమితమైన ఈ ప్రాణాంతక వైరస్ క్రమంగా ప్రపంచమంతా వేగంగా వ్యాపిస్తోందని, అప్రమత్తంగా లేకుంటే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని చిఊహూ హెచ్చరికలు జారీ చేసింది. గతంలో కూడా మంకీపాక్స్ వైరస్ వెలుగు చూసినప్పటికీ ఈసారి మరింత ప్రమాదకరంగా మారే ప్రమాదం పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది . ఆఫ్రికా దేశాలతో పాటు మన పక్క దేశం పాకిస్థాన్‌లోనూ ఎంపాక్స్ కేసులు గుర్తించినట్లు చిఊహూ ప్రకటించడంతో టెన్షన్ మరింత ఎక్కువైంది.మంకీ పాక్స్ వ్యాధి ఆఫ్రికా దేశాల్లో దశాబ్దాలుగా ఉంది. మరీ ముఖ్యంగా కాంగో దేశంలో ఈ వ్యాధి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. 1970లో తొలిసారి ఈ వ్యాధి ఆ దేశంలో వెలుగుచూసింది. కాంగోకు చెందిన 9 నెలల బాలుడికి మంకీ పాక్స్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. ఇది ప్రపంచంలో ఓ మనిషికి సోకిన తొలి మంకీ పాక్స్ వైరస్ కేసు. వాస్తవానికి పరిశోధనల కోసం తీసుకొచ్చిన కోతుల్లో మొట్టమొదటిసారి ఈ వ్యాధిని 1958లో డెన్మార్క్‌లో గుర్తించారు. అందుకే దీనికి మంకీ పాక్స్ అని పేరు పెట్టారు. మంకీపాక్స్ కేసు 2022లో మన దేశంలో కేరళలో కూడా ఒకటి నమోదైంది. జంతువుల నుంచి మనిషికి.. మనిషి నుంచి మనిషి ఈ వైరస్ వ్యాపిస్తుంది. కోతులు, ఉడతలు, ఎలుకలు కొరకడం, గోళ్లతో గీకడం, వాటికి దగ్గరగా ఉండటం, లేదా సరిగ్గా ఉడకకుండా వాటిని తినడం ద్వారా ఈ వైరస్ వాటి నుంచి మనుషులకు వ్యాపిస్తుంది. ఆఫ్రికా దేశాల్లో తొలినాళ్లలో వేటగాళ్లు ఎక్కువగా ఈ వైరస్ బారినపడినట్లు గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి.దశాబ్దాలుగా మంకీ పాక్స్ వస్తూ పోతూ కాంగో సహా ఆఫ్రికా దేశాల్లో జనానికి ప్రత్యక్ష నరకం చూపుతోంది. పాత వ్యాధి కొత్త రూపు సంతరించుకొని ఇప్పుడు యావత్ ప్రపంచ దేశాలను భయపెడుతోంది. గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు కాంగోలో 27వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. 1100 మరణాలు సంభవించాయి. మంకీపాక్స్ అనే వైరస్ నుంచి ఈ వ్యాధి ప్రబలుతోంది. ఈ కేసులు పెరుగుతుండటంతో ఇది కూడా కోవిడ్ తరహాలో ప్రాణాంతకంగా మారే అవకాశముందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం మనిషి నుంచి మనిషికి ఈ ఎం పాక్స్ వైరస్ అత్యంత వేగంగా విస్తరించడం యావత్ ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. గర్భిణి మహిళ ఈ వైరస్ బారినపడితే.. గర్భాశయంలోని శిశువుకు కూడా ఈ వైరస్ వ్యాపించే అవకాశముంది. సెక్స్ కారణంగా ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదు. అయితే వైరస్ బారినపడి చర్మపు పగుళ్లు ఉండిన వ్యక్తితో మరో వ్యక్తి చర్మం రాపిడి జరిగితే వైరస్ వ్యాపించే అవకాశముందని వైద్య నిపుణులు చెబుతున్నారు.జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, అలసట, వాపుతో పాటు చీము నిండిన పొక్కులు ఎంపాక్స్ వైరస్ సోకిన వ్యక్తుల్లో సాధారణ లక్షణాలుగా కనిపిస్తాయి. ఈ పొక్కులు ముఖంపై మొదలై క్రమంగా శరీరమంతా విస్తరిస్తున్నాయి. సాధారణంగా ఈ పరిస్థితి రెండు నుంచి నాలుగు వారాలు ఉంటోంది. ఏ చికిత్స తీసుకోకున్నా అది తగ్గిపోతుంది కానీ.. ఆ తర్వాత దాని వల్ల రకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కొన్ని సందర్భాల్లో అది ఏకంగా మరణానికీ దారితీస్తుండటం ఆందోళన కలిగించే అంశం. మరీ ముఖ్యంగా రోగనిరోధకశక్తి తక్కువ ఉండేవాళ్లు, అప్పటికే కొన్ని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ వైరస్ బారినపడితే ఇక కోలుకోవడం కష్టంగా మారుతోంది.కొన్నేళ్లుగా ఆఫ్రికా దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ వ్యాధి.. ఇప్పుడు ఇతర దేశాలకు కూడా వ్యాపిస్తూ ప్రపంచ దేశాలను హడలెత్తిస్తోంది. ప్రస్తుతం ఈ వ్యాధి ప్రభావం 116 దేశాలపై ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 15,600 మంకీ పాక్స్ కేసులు నమోదవ్వగా 537 మంది మృతి చెందారు. ఇప్పటి వరకు తూర్పు, పశ్చిమ, మధ్య ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఎం-పాక్స్ ఇప్పుడు అమెరికా, యూరోప్‌కు కూడా వ్యాపించింది. స్వీడన్, పాకిస్థాన్ దేశాల్లోనూ తొలి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అయితే భారత్‌లో ప్రస్తుతం ఈ కేసులు ఏవీ నమోదుకాలేదు.ప్రస్తుతం ఈ వ్యాధికి ఎటువంటి చికిత్స లేదు. లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రస్తుతానికి ఉన్న మార్గం. స్మాల్ పాక్స్ కోసం రూపొందించిన మూడు వ్యాక్సిన్స్ మంకీపాక్స్ నివారణకు కూడా కూడా ఆమోదించారు. అయితే వీటికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇంకా ధృవీకరించలేదు. ఇప్పుడు ఎం-పాక్స్‌ను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించడంతో దీనిపై పరిశోధనకు, వైద్య సాధనాల అందుబాటు పెంచేందుకు నిధుల వెసులుబాటు పెరుగుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎం పాక్స్ కేసులతో ప్రపంచ దేశాలు అలెర్ట్ అయ్యాయి. ఇతర దేశాల నుంచి తమ దేశానికి ఈ వైరస్ సోకకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాయి. మంకీ పాక్స్ కేసులతో అప్రమత్తమైన చైనా.. తమ దేశానికి వచ్చేవారికి స్క్రీనింగ్ టెస్టులు చేస్తోంది.ప్రపంచ వ్యాప్తంగా మంకీ పాక్స్ వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇటు భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. కరోనా మహమ్మారిని ఎదుర్కొన్న తరహాలోనే మంకీ పాక్స్ వైరస్ ను ఎదుర్కొనేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు. మంకీపాక్స్‌ను ఎదుర్కొనే విషయంలో సన్నద్ధతపై ప్రిన్సిపల్ సెక్రటరీ నేతృత్వంలో హై లెవల్ రివ్యూ నిర్వహించారు. రాష్ట్రాల్లో టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ అధికారులను ఆదేశించారు. వ్యాధిని త్వరగా గుర్తించేలా చర్యలు చేపట్టాలను అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

# రుణమాఫీ పట్ల .. అలసత్వం వద్దు

- మొదటి పేజీ తరువాయి

దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని అన్నారు. ఇతర రాష్ట్రాల కంటే ముందంజలో ఉండేలా తమ ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. బ్యాంకర్లు పూర్తిగా సహకరించాలని కోరారు. లెక్కలు కాదని, ఆత్మతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయం తో పాటు పారిశ్రామిక రంగానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉపాధి కలుగుతుంది. వారికి విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాలకు లక్ష కోట్లు వడ్డీ లేని రుణాలు రూపంలో ఇవ్వనున్నామని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ఫస్ట్ క్వార్టర్ లో ప్రాధాన్యతా రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరును కనబరిచినందుకు సంతోషిస్తున్నట్టు చెప్పారు. తొలి క్వార్టర్ లోనే ప్రాథమిక రంగం కింద బ్యాంకులో ఇప్పటివరకు 40.62% వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమని చెప్పారు. రాష్ట్రం నగదు నిల్వలనిష్పత్తి మొదటి క్వార్టర్లో 127. 29 శాతానికి మెరుగుపడడం ఆసక్తికరమైన అంశమని అన్నారు.

# కవిత బెయిల్ పిటీషన్ విచారణ వాయిదా

- మొదటి పేజీ తరువాయి

జస్టిస్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. బెయిల్ పిటిషన్ పై ఈడీ కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 27నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం లోపు అంటే ఆగస్ట్ 23వ తేదీలోపు కవిత తరఫు న్యాయవాది రిజాయిండర్ దాఖలు చేయాలని సూచించింది. హైకోర్టులో కేసు డెరీ ఉండగా కౌంటర్ దాఖలు చేసేందుకు ఆలస్యమెందుకని ఈడీని కోర్టు ప్రశ్నించింది. ఈ సందర్భంగా కవిత తరఫు న్యాయవాది ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపిస్తూ.. మహిళగా కవిత బెయిల్ కు అర్హురాలని తెలిపింది. ఇదే కేసులో సహనిందితులుగా ఉన్న మనీష్ సిసోడియా, అర్వింద్ కేజ్రీవాల్ కి బెయిల్ మంజూరు

చేశారని, కవితకు బెయిల్ ఇవ్వాలని కోరారు.లిక్కర్ స్కాం కేసు విచారణ పూర్తయందని, చార్జిషీట్ కూడా ఫైల్ చేసినందున బెయిల్ మంజూరు చేయాలని వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

# తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

ఇందులో భాగంగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు సచివాలయ ఆవరణను పరిశీలించారు. విగ్రహ ఏర్పాటు స్థలం, ఏరియా డిజైన్ ప్రణాళికలపై అధికారులతో చర్చించారు సీఎం రేవంత్ రెడ్డి.

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని అధికారులకు సూచించారు. పూర్తి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# నా మాటలు గుర్తు పెట్టుకో రేవంత్...

- మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్స్ వేదికగా స్పందించారు.

తాము అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే అంబేద్కర్, సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తామన్నారు. నీలాంటి ఢిల్లీ బానిస తెలంగాణ ఆత్మగౌరవాన్ని, తెలంగాణను అర్థం చేసుకోలేరని విమర్శించారు. చిన్నపిల్లల ముందు చెత్త మాటలు మాట్లాడిన నైజం, వ్యక్తిత్వం, ఆయన పెంపకాన్ని సూచిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మానసిక రుగ్మత నుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని చురక అంటించారు.

# బిల్డర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

- మొదటి పేజీ తరువాయి

ప్రారంభిస్తామని.. లింక్ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని వివరించారు మంత్రులు. బిల్డర్ల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని హామీ ఇచ్చారు.క్రెడాయ్ తెలంగాణ ప్రెసిడెంట్ ప్రేమ్ సాయిరెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగంలోని నిపుణులు ఎన్నో విలువైన సూచనలు, సలహాలు ఇస్తున్నారని.. వాటిని బిల్డర్లు అనుసరించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ నీ ఉపయోగించుకుని బిల్డర్లు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం భూముల ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకుందని.. అదే విధంగా రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారాయన.

ఈ కార్యక్రమంలో క్రెడాయ్ చైర్మన్ మురళి కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పాండు రంగారెడ్డి, క్రెడాయ్ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిల్డర్లు పాల్గొన్నారు.

## రహస్య ప్రాంతంలో కొనసాగుతున్న వాసుదేవరెడ్డి విచారణ...

- మొదటి పేజీ తరువాయి

సీఐడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం విక్రయాల విషయంపై వాసుదేవరెడిపై భారీ అభియోగాలు నమోదయ్యాయి.వైసీపీ హయాంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అప్పట్లో డిప్యూటేషన్ పై వాసుదేవరెడ్డిని రప్పించారని వార్తలు వచ్చాయి. ఏపీలో మద్యం విక్రయాలు పెంచే బాధ్యత ఆయనకు జగన్ అప్పగించారని టీడీపీ నేతలు గతంలోనే ఆరోపించారు. దాంతో వాసుదేవరెడ్డి రాష్ట్రంలో డిస్టిలరీలు, డిపోలు, షాపులపై అజమాయిషీ చేశారు. ఇంకా చెప్పాలంటే ఏపీలో జే బ్రాండ్లు తీసుకురావటంలో వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించారట. ఏపీలో మద్యంపై ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టి వైసీపీ ప్రభుత్వం వేల కోట్లు అప్పులు తెచ్చిందని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఏపీలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ దారుణ ఓటమి చవిచూసింది. అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు గత ఐదేళ్లలో జరిగిన పాలనలో లోపాలు, అవినీతిపై ఫోకస్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వాసుదేవరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లగా.. 2 నెలల తరువాత ఏపీ సీఐడీ ఆయనను అరెస్ట్ చేసింది. వాసుదేవరెడ్డి అరెస్ట్ వార్త రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ హయాంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో భారీ అవినీతి జరిగిందని, ఎన్నికల అనంతరం కార్పొరేషన్ ఆఫీసు నుంచి ఫైళ్లు మాయం చేశారని వాసుదేవరెడ్డిపై సీఐడీ కేసు నమోదు చేసింది. తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం వాసుదేవరెడ్డికి మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడం తెలిసిందే.ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మె?గులూరుకు చెందిన శివకృష్ణ ఫిర్యాదుతో వాసుదేవరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్పొరేషన్ నుంచి ఫైళ్లు తరలిస్తున్నట్లు చూశానని ఆ ఫిర్యాదులో శివకృష్ణ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏపీ సీఐడీ రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లో వాసుదేవరెడ్డికి చెందిన ఓ ఖరీదైన విల్లాలో మూడు రోజులపాటు సోదాలు నిర్వహించారు. ఆయనకు సంబంధించిన నివాసాలలో సోదాల్లో భాగంగా కీలకమైన డాక్యుమెంట్లు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ట్రాఫిక్ సర్వీస్ ఉద్యోగిగా ఉండే వాసుదేవరెడ్డి డిప్యూటేషన్ పై ఏపీ ప్రభుత్వానికి వచ్చారు. అప్పటి సీఎం వైఎస్ జగన్, వాసుదేవరెడ్డికి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు అప్పగించారు. వైసీపీ నేతలకు సంబంధించిన డిస్టిలరీల నుంచి వచ్చే మద్యాన్ని విక్రయించేలా చూశారని, మద్యం ఆదాయం చూపించి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చుకోవడంలోనూ వాసుదేవరెడ్డి కీలకంగా వ్యవహరించాలని టీడీపీ నేతలు ఆరోపించారు.

# మీ అయ్య చారాణా.. నువ్వు బారాణా

కల్లు తాగిన కోతిలెక్క దుంకులాడుతున్నాడు. నువ్వు పొలిటికల్ కోచింగ్ సెంటర్ లో ట్రైనింగ్ తీసుకుంటే బెటర్. రాజీవ్ గాంధీ దేశ ప్రజల కోసం బలిదానం అయ్యారు. మిలిటెంట్లు కాల్చి చంపింది నిజమే కదా ? రాజీవ్ గాంధీ విగ్రహం సెక్రటేరియట్ ముందు తీసేస్తం అంటావా? మీ అయ్య కేసీఆర్ చారాణా చేస్తే, నువ్వు బారాణా చెప్తావు. మీరు పొలిటికల్ గా పవర్ లోకి రారు. మేం సోనియా గాంధీ..రాహూల్ గాంధీల కు నీతిగా గులాం చేస్తాం.. మీ లెక్క కన్నింగ్ కాదు' అని అన్నారు.

# వాగులు కాదు రోడ్లు.. ఇది మన హైదరాబాదే

- మొదటి పేజీ తరువాయి

వారిని మరింత భయపెడుతున్నాయి. పలు చోట్ల సామాన్యులే ట్రాఫిక్ సిబ్బంది అవతారమెత్తారు. రోడ్లపై నిల్చొని వాహనదారులను, ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా సహాయం చేస్తున్నారు.

**నిండుకుండలా హుస్సేన్‌సాగర్**

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండంతో నీటిమట్టం అంతకంతకూ పైకి చేరుతోంది. పరిశీలించిన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత హుస్సేన్ సాగర్ దిగువన ఉన్న కాలనీలోని ప్రజలను అప్రమతంగా ఉండాలని సూచించారు.

# ఆత్మహత్య అని ఎలా చెప్పారు?..

- మొదటి పేజీ తరువాయి

ఎలా భావించారని వైద్య సిబ్బందిని ప్రశ్నించింది. డాక్టర్ ఆత్మహత్య చేసుకుందని బాధితురాలి కుటుంబానికి చెప్పడం వెనక కారణమేంటని నిలదీసింది. అదేవిధంగా ఈ దారుణం ఉదయం చోటుచేసుకోగా మధ్యాహ్నం 4 గంటలకు పోస్టుమార్టం పూర్తయిందని గుర్తుచేస్తూ.. ఎఫ్ఐఆర్ మాత్రం రాత్రి 11:45 గంటలకు నమోదు చేసినట్లు ఉందని వెల్లడించింది. అంత జాప్యం ఎందుకు జరిగిందని, అప్పటి వరకు ఏంచేస్తున్నారని పోలీసులను ప్రశ్నించింది.ఈ దారుణానికి సంబంధించిన వార్తలలో బాధిత డాక్టర్ పేరు, ఫొటోలను కొన్ని మీడియా సంస్థలు ప్రచురించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, కోల్ కతా వైద్యురాలి హత్యాచారం కేసును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించిన విషయం తెలిసిందే. మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ను మరో కాలేజీకి బదిలీ చేయడాన్ని తప్పుబట్టింది. ఈ హత్యాచారం కేసులో ప్రిన్సిపాల్ ప్రవర్తనపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో మరో కాలేజీకి ఆయనను ఎలా పంపించారని బెంగాల్ ప్రభుత్వాన్ని సీజేఐ బెంచ్ ప్రశ్నించింది.

## దువ్వాడ వాణికి మాధురి కౌంటర్

**శ్రీకాకుళం** దువ్వాడ వాణి వ్యాఖ్యలకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ప్రేయసి దివ్వల మాధురి కౌంటర్ ఇచ్చారు. నా వలన దువ్వాడ శ్రీనువాస్ కు ప్రాణహాని ఉందని, వాణి ఆరోపించారు. రెండేళ్లు శ్రీనువాస్ ఆలనా పాలనా నేనే చూసుకున్నా. రెండేళ్లుగా లేని థ్రెట్ ఇప్పుడే వచ్చిందా...? దువ్వాడను చంపడానికి వాణి ప్రయత్నించిందని ఆరోపించారు. 10 మందిని తీసుకొచ్చి ఇంటి తలుపులు పగులగొట్టారు. ఎవరి వల్ల ప్రాణహాని ఉందో అందరికీ తెలుసు. ఇంటి నిర్మాణానికి రూ.2 కోట్లు నేను ఇచ్చా. వాణి నా డబ్బు చెల్లించి ఈ ఇంటిని తీసుకోవచ్చని అన్నారు.

# మేడ్చల్ లో పలు ప్రాంతాలు జలమయం



**మేడ్చల్** మేడ్చల్ పట్టణంలో సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం దంచి కొట్టింది. దీంతో పట్టణంలోని అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలోకి వెళ్లాయి. దీంతో రోడ్డు పై నీటి గుంటలు ఏర్పడి వాహనా దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ క్రమంలో స్కూలుకి వెళ్లే విద్యార్థులు తల్లిదండ్రులు ఉద్యోగస్తులు భారీ వర్షం ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ప్రజలు అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని అధికారులు రుతున్నారు.

# సెప్టెంబర్ 5-6 తేదీల్లో ఏఐ గ్లోబల్ సమ్మిట్

**హైదరాబాద్, ఆగస్టు 20:** ఐటీ రంగంలోనే విప్లవాత్మక మార్పులకు కేంద్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉంది. ఈ వాతావరణంలో హైదరాబాద్ నగరం ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మారనుందా? అంటే అవునంటోంది తెలంగాణ సర్కారు. కృత్రిమ మేధస్సులో హైదరాబాద్ సాధిస్తున్న ప్రగతి చూస్తుంటే త్వరలోనే ఈ ప్రయత్నాలు ఫలిస్తాయనే సూచనలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏఐ వినియోగం గణనీయంగా పెరుగుతుండటంతో దాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. దీని దిశగా ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టగా? సెప్టెంబర్ 5–6 తేదీల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ కార్యక్రమం ఏఐ గ్లోబల్ సమ్మిట్‌ను భాగ్యనగరంలో నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార కార్యక్రమాన్ని, వెబ్‌సైట్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల ప్రారంభించారు. హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ ఏఐ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, యోట్టా, ఎన్‌విడియా వంటి టెక్నాలజీ కంపెనీలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు ఇండస్ట్రీ పార్ట్‌నర్స్ హైసీయా, సీఐఐ, వరల్డ్ ఎకనామిక్ ఫోరం, నాలెడ్జ్ పార్టనర్‌గా నాస్‌కామ్‌లు ఉన్నాయి. ఇక, హెచ్‌ఐసీసీ వేదికగా రెండు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌పై దేశ, విదేశాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది తెలంగాణ సర్కారు. ఇప్పటికే సదస్సులో ప్రధానంగా చర్చించాల్సిన అంశాలను ఎంపిక చేసి, వాటిపై విస్తృత అనుభవం ఉన్న నిపుణులతో కీలక ప్రసంగాలు చేసేలా.. షెడ్యూళ్లను నిర్ణయించారు. ఏఐ ఫర్ సోషల్ చేంజ్, సేఫ్ ఏఐ, పుషింగ్ బౌండరీస్ ఆఫ్ ఇన్నోవేషన్, పారడిజిమ్ షిఫ్ట్ ఇన్ ఇండస్ట్రీ తదితర అంశాలపై నిపుణులు ఇక్కడ చర్చించనున్నారు. ఇటీవల, గ్లోబల్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ సమ్మిట్ లోగోను ఆవిష్కరించిన




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి? తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నగరాన్ని ఏఐ సిటీగా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. సాంకేతిక ఆవిష్కరణలతో తెలంగాణ రాష్ట్రాన్ని మరింత ముందంజలో ఉంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. 'మేకింగ్ ఏఐ వర్క్ ఎవ్రీ వన్' అనే కాన్సెప్ట్‌తో గ్లోబల్ ఏఐ సమ్మిత్ ఉంటుందని తెలిపారు. అయితే, సమాజానికి ఏఐ ఎలా ప్రయోజనం చేకూరుస్తుందో, ఎలా సాధికారత కల్పిస్తుందో అన్వేషించటమే లక్ష్యంగా ఈ సదస్సు జరుగుతుంది. ఏఐ పరిజ్ఞానంతో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి? ప్రపంచం ఎదుట ఉన్న సవాళ్లను పరిష్కరించడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకు వీలుగా ఏఐ సామర్థ్యాలను అన్వేషించేందుకు ఈ సమ్మిట్ కీలక వేదికగా మారనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నగరాన్ని ఏఐ రాజధానిగా మార్చడానికి కావాల్సిన అన్ని వనరులను సమకూరుస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తెలంగాణకు భారీగా పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా, దక్షిణ కొరియా పర్యటన సాగిందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

పలు కంపెనీలతో పెట్టుబడుల ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. మొత్తం 19 కంపెనీలతో ఓజలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. ఈ పర్యటనలో రాష్ట్రానికి 31 వేల 500 కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఇక, ఏఐ ప్రాధాన్యతను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి 200 ఎకరాల స్థలంలో 'ఏఐ సిటీ' నిర్మాణాన్ని చేపడుతున్నారు. 2030 సంవత్సరానికల్లా ఐటీ ఉత్పత్తుల ఎగుమతుల్లో తెలంగాణను అగ్రస్థానంలో నిలపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇప్పటికే పలుమార్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ మహానగరంలో ఏర్పాటు చేస్తున్న ఏఐ సిటీ రూపకల్పనపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇక, టెక్నాలజీ విద్యాసంస్థలు కూడా దీని దిశగా కోర్సులు రూపొందించాలనీ? విద్యార్థులను ఏఐ టెక్నాలజీ దిశగా ప్రోత్సహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని ఏఐ రాజధానిగా మార్చడం కోసం మేధావులు సూచనల మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ రంగంలో తెలంగాణ భవిష్యత్తు, కొత్త ప్రాజెక్టులకు నాంది పలికే అవకాశం ఉందని నిపుణులు కూడా ఒప్పుకుంటున్నారు. కాగా, ప్రభుత్వ పరిపాలన, పారిశ్రామిక రంగాల్లో కృత్రిమ మేధ వినియోగానికి అనుసరించాల్సిన విధానాలపై కూడా తెలంగాణ సర్కారు రోడ్ మ్యాప్ రూపొందిస్తోంది. అలాగే, హైదరాబాద్‌లో ఏఐ అభివృద్ధి కోసం, పెట్టుబడుల సాధనకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని ఇప్పటికే సర్కారు పిలుపునిచ్చింది. ఇటీవల అమెరికా పర్యటనల్లో దీనికి సంబంధించి పలువురు ఎన్నారైలతో సీఎం ప్రత్యేకంగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇలా వచ్చే ప్రవాస భారతీయులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం?ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందనే సందేశాన్ని సీఎం ఇచ్చినట్లు తెలుస్తోంది. .

# కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అలక...

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, ఆగస్టు 20:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కూటమి విజయం సాధించిన తర్వాత కనిపించడం మానేశారు. దాదాపు రెండు నెలల నుంచి ఆయన పెద్దగా వినిపించడం లేదు. కనిపించడం లేదు. పార్టీ అధికారంలో లేనప్పుడు ఏ నేత అప్పటి అధికార పార్టీపై విమర్శలు చేసేందుకు వెనుకాడినప్పుడు కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఒక్కరే తన మాటలతో ?విరుచుకుపడేవారు. అంతేకాదు ఆయన ప్రతి రోజూ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం పెట్టి అధికార పార్టీని చీల్చిచెండాడేవారు. అలాంటి పట్టాభి టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఎక్కువగా మౌనాన్ని ఆశ్రయిస్తున్నట్లు కనపడుతుంది. కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చేసిన పదునైన విమర్శలతో నాటి అధికార వైసీ?పీకి ఆయన శత్రువుగా మారారు. ఆయన ఇంటిపై దాడులు కూడా జరిగాయి. పట్టాభి కొన్ని కేసుల్లో అరెస్టయి రాజమండ్రి జైలుకు వెళ్లి వచ్చారు. ఎన్నో కేసులు ఎదుర్కొన్నారు. మాటలు పడ్డారు. గాయపడ్డారు. అయినా టీడీపీ విషయంలో వెనక్కు తగ్గలేదు. చంద్రబాబు నాయుడు స్వయంగా కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఇంటికి వచ్చి మరీ ఆయనను పరామర్శించి వెళ్లారు. మిగిలిన సీనియర్ నేతలు అందరూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నప్పటికీ పట్టాభి అంతా తానే అయి కేంద్ర పార్టీ కార్యాలయంలో తన వాయిస్ ను



బలంగా వినిపించే వారు. అప్పుడప్పుడు కొన్ని మీడియా ఛానల్స్ లో మాత్రం కనిపిస్తున్నారు. అయితే కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కు అధికారంలోకి వచ్చిన తర్వాత కీలకమైన పదవి వస్తుందని అందరూ భావించారు. రేపు చంద్రబాబు భర్తీ చేయబోయే పోస్టులలో పట్టాభికి ఖచ్చితంగా ఒక పదవి వస్తుందన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. యువకుడు కావడం, మంచి వాగ్ధాటి ఉండటంతో పట్టాభికి మంచి పదవినే చంద్రబాబు కట్టబెట్టే అవకాశాలున్నాయంటున్నారు. అందుకోసమే పట్టాభి వెయిట్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు పార్టీ అగ్రనాయకత్వం నుంచి పట్టాభికి సంకేతాలు అందినట్లు చెబుతున్నారు. అది కూడా కీలకమైన క్యాబినెట్ ర్యాంక్ ఉన్న పదవిని చంద్రబాబు పట్టాభి కోసం సిద్ధం చేసినట్లు అంటున్నారు. పదవిలోకి వచ్చిన తర్వాత కొంత ఆచితూచి మాట్లాడాలని, తక్కువగా మాట్లాడి ఎక్కువ పనులు చేయాలని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో పాటు మంత్రులు విపక్షానికి కౌంటర్లు ఇస్తుండటంతో ఇక తనకు పెద్దగా పనిలేదని ఆయన భావిస్తున్నారు. దీంతో పాటు పదవి వచ్చేంత వరకూ ఒకింత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందుకే గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి అంశం పై కూడా ఆయన పెద్దగా స్పందించడం లేదంటున్నారు. కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పదవి కోసమే వెయిట్ చేస్తున్నారని తెలిసింది. కొద్ది రోజులలోనే పట్టాభి తిరిగి యాక్టివ్ అవుతాడంటున్నారు.

# ముఖ్యమైన ఫైల్స్ పైనే... మంటలు....



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, ఆగస్టు 20:** ఏపీలో ఈ మధ్య విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరిగి ముఖ్యమైన ఫైల్స్ మాత్రమే కాలిపోయే స్కీమ్ నడుస్తుంది. గడిచిన మూడు నెలల కాలంలో ఏపీ లో జరుగుతున్న ప్రమాదాల పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో అగ్ని ప్రమాదం జరిగితే ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలు, అందులోని వస్తువులు ఇలా ఆస్తి నష్టమో లేదా కొన్ని సందర్భాల్లో ప్రాణ నష్టమో జరిగేది. కాని ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలు మాత్రం కేవలం ఫైల్స్ మాత్రమే కాలిపోయి సాక్ష్యం లేకుండా అయ్యేలా ప్రమాదాలు జరుగుతుండడం గమనార్హం. ఇలాంటి ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం సైతం సీరియస్ గా దృష్టి పెట్టింది. మొన్న అమరావతి, నిన్న మదనపల్లి, దవళేశ్వరం కార్యాలయం.. నేడు తిరుపతి... అగ్ని ప్రమాదాలు. తిరుమల తిరుపతి దేవస్థానం లో అనేక అవకతవకలు జరిగాయని, తిరుమలను కూడా వ్యాపార కేంద్రంగా మార్చారని కూటమి ప్రభుత్వం ఆరోపణలు చేసింది. ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎనలేని మెజారిటీతో గెలిపించారు. ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తిరుమల కు వచ్చిన నారా చంద్రబాబు నాయుడు తిరుమల నుంచే ప్రక్షాళన చేస్తానని చెప్పారు. అందుకు తగిన రీతిలో అప్పటి వరకు ఈవో లేకపోవడంతో కొత్త ఈవో నియామకం, అదనపు ఈవో గా ఉన్న ఏవీ ధర్మారెడ్డి ను పంపివేయడం... కొత్తగా తిరుమల అదనపు ఈవో నియామకం చేయడం... సీవీఎస్వో సహా అందరినీ మార్చడం చేశారు. ఇలా ప్రారంభమైన ప్రక్షాళన గత ప్రభుత్వ హయాంలో జరిగిన అనేక ఇంజినీరింగ్ పనులు, రీవర్స్ టెండర్స్, శ్రీవాణి ట్రస్ట్ నిధులపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ విభాగం చేత విచారణ ప్రారంభించారు. టీటీడీ లాంటి పుణ్యక్షేత్రం లో విజిలెన్స్ విచారణ అంటేనే దేశ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. టీటీడీ లో గత ప్రభుత్వంలో జరిగిన అనేక ఇంజినీరింగ్ పనులకు సంబంధించి వివరాలు ఇవ్వని, సరైన పత్రాలు చూపించని టీటీడీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 55 మంది ఇంజనీర్లకు రాష్ట్ర విజిలెన్స్ విభాగం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దానిపై ఇంజినీరింగ్ యూనియన్ సభ్యులు స్థానిక నాయకులను, అధికారులను సైతం కలిసారు. వారు నుంచి సానుకూలంగా స్పందించినా ఈనెల 14న సమావేశం నిర్వహించి అవసరమైతే సమ్మె చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని అనుకున్నారు. అయితే సమావేశం వాయిదా పడింది. రెండు రోజుల వ్యవధిలో అగ్ని ప్రమాదం కలకలం రేపింది. టీటీడీ పరిపాలన భవనంలో శనివారం సాయంత్రం ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ ఇంజినీర్ భాస్కర్ ఛాంబర్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పలు కీలక ఫైల్స్ దగ్ధం అయ్యాయి. గదిలో నుంచి పొగలు రావడాన్ని గుర్తించి టీటీడీ భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిని ఆర్పివేసారు. అయితే ఎలా ప్రమాదం జరిగిందని అధికారులను అడిగితే ప్రతిరోజు పూజించే దీపం పడి ప్రమాదం జరిగిందేమే అని అంటున్నారు. టీటీడీ పరిపాలన భవనం ఇటీవల కాలంలో రినోవేషనే చేశారు. అన్ని విభాగాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాంటి టీటీడీ పరిపాలన భవనంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం లేదు. మరీ దీపం పడి ఫైల్స్ మాత్రమే కాలిపోవడం ఏంటని ప్రశ్న వినిపిస్తుంది. సమాచారం అందుకున్న టీటీడీ ఉన్నతాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఆ గదిలో ఏఏ రికార్డులు ఉన్నాయి.. అవి ఈ ఫైలింగ్ లో ఉన్నాయా లేదా... అసలు ప్రమాదానికి కారణం ఏంటి... ఏద్దైన కుట్ర కోణం ఉందా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

## కోల్కతా హత్యాచార ఘటనపై సుప్రీం కీలక వ్యాఖ్యలు.. టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు ఆదేశాలు..




కోల్కతా హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆర్జికార్ ఆసుపత్రి కేసుకు సంబంధించిన పిటిషన్ పై విచారణ జరుపుతున్న సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వైద్యుల భద్రత కోసం పది మంది ప్రముఖ వైద్యులతో నేషనల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ ఘటనలో బాధితురాలి పేరు, ఫోటో మరియు వీడియో క్లిప్‌లు ప్రతిచోటా పబ్లిష్ చేయటంపై తీవ్ర ఆందోళన కలిగిస్తుందని పేర్కొంది. బాధితుల పేర్లను ప్రచురించటం చట్టపరంగా నిషేధం అయినప్పటికీ ఆమె పేరును పబ్లిష్ చేస్తే ఆమెను కించపరిచినట్లు కాదా అని ప్రశ్నించింది. నిరసనకారులపై అధికారం చెలాయించొద్దని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది సుప్రీంకోర్టు. పరిస్థితుల్లో మార్పు కొసం ఇలాంటి మరో హత్యాచార ఘటన జరిగేంతవరకు దేశం వేచి ఉండదని అభిప్రాయపడింది సుప్రీం.

## తాగుతున్నారు.... తిరుగుతున్నారు...



**హైదరాబాద్, ఆగస్టు 20:** మూడు కమిషనరేట్?ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నా కొంతమంది డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావటం లేదు. ఏకంగా 3,000 మంది మద్యం సేవించి వాహనం నడుపుతూ రెండోసారి పోలీసులకు పట్టబడ్డారు. గడిచిన రెండు సంవత్సరాల వ్యవధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వాహనదారుల గణాంకాలను ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. సుమారు 3000 మంది రెండవసారి మద్యం తాగి వాహనం నడిపి పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో తరచుగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారిని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. 2023 జనవరి నుండి ఇప్పటివరకు 1587 మంది మద్యం సేవించి వాహనం నడిపిన వారిని పోలీసులు పట్టుకున్నారు. వీరంతా రెండవసారి మద్యం సేవించి ఏదేచ్ఛగా వాహనం నడుపుతూ పోలీసులు తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. హైదరాబాద్ తర్వాత రెండో స్థానంలో సైబరాబాద్ ఉంది. సైబరాబాద్‌లో ఎక్కువగా పదేపదే మద్యం సేవించి వాహనం నడిపిన వారు 956 మందిగా చెబుతున్నారు. వీరంతా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలోనే పోలీసులకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ పోలీసులు ప్రతి వీకెండ్‌లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. వాహనదారులకు (బ్లడ్ ఆల్కహాల్ కౌంట్) పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరిలో కొంతమందికి ఫైన్లతో సరి పెడితే.. మరికొంతమందిని కోర్టులకు హాజరుపరుస్తున్నారు. వారిపై విచారణ జరిపిన న్యాయస్థానాలు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఎక్కువసార్లు పట్టుబడుతున్న వారికి జైలు శిక్షను విధిస్తున్నాయి. కేవలం జూలై నెలలోనే 2,483 మంది వాహనదారులను పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్?లో పట్టుకున్నారు. 15 రోజుల వ్యవధిలోనే హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో ఇంతమంది పట్టుబడటం సరికొత్త రికార్డుగా చెబుతున్నారు పోలీసులు. పదేపదే తాగి వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే ఫైన్ తో పాటు వారి డ్రైవింగ్ లైసెన్స్ సైతం రద్దు చేస్తున్నారు పోలీసు అధికారులు

## 12 ఏళ్లు ... 550 కిలోలు తగ్గాడు

**దుబాయ్, ఆగస్టు 20:** ఉండాల్సిన దానికంటే అధికంగా ఉంటే అది ఏదైనా ప్రమాదమే. అందుకే ఏదైనా మితంగా ఉండాలని పెద్దలంటుంటారు. అయితే ఇతడి విషయంలో ఆ పదం తప్పిపోయింది. ఫలితంగా ప్రపంచంలోనే అత్యంత బరువైన వ్యక్తిగా అతడు పేరు పొందాల్సి వచ్చింది. ఏకంగా 610 కిలోల భారీ శరీరంతో ప్రపంచంలోనే అత్యంత బరువు ఉన్న వ్యక్తిగా అతడు రికార్డ్ సృష్టించాడు. అంతటి బరువు ఉండడంతో ఆరోగ్యం అత్యంత విషమంగా ఉండేది. మూడు సంవత్సరాలు పాటు అతడు మంచానికే పరిమితం అయ్యాడు. విపరీతమైన బరువు వల్ల కనీసం తన వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేకపోయేవాడు. ప్రతి చిన్న పనికి కూడా కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల మీద ఆధారపడేవాడు. అయితే అతని దుస్థితిపై మీడియాలో విపరీతమైన కథనాలు ప్రసారమయ్యాయి. ఆ విషయం సౌదీ అరేబియా రాజు అబ్దుల్లా చెవికి చేరింది. దీంతో ఆయన రంగంలోకి దిగాడు. అలా 610 కిలోల బరువు ఉన్న వ్యక్తి పేరు ఖలీద్ బిన్ మొహ్సిన్ షరీ. అతడి పరిస్థితి తెలుసుకున్న సౌదీ అరేబియా రాజు 30 మంది ప్రఖ్యాతమైన వైద్య నిపుణుల బృందాన్ని అతని వద్దకు పంపించాడు. ఏకంగా రాజు పంపించడంతో వారు యుద్ధ ప్రాతిపదికన చికిత్స మొదలుపెట్టారు. అతడిని ప్రత్యేకమైన మంచం మీద పడుకోబెట్టారు. లిఫ్ట్ ద్వారా రియాజ్ ప్రాంతంలోని కింగ్ ఫహద్ మెడికల్ సిటీకి తరలించారు . అక్కడ అతడికి గ్యాస్ట్రిక్ బైపాస్ సర్జరీ చేయించారు. చాలాకాలం పాటు అదరికి ప్రత్యేకమైన ఆహారం అందించారు. వ్యాయామం చేయించారు. విస్తృతంగా చికిత్స అందించారు.. ఫలితంగా మొదటి ఆరు నెలల్లో ఖలీద్ 305 కిలోల బరువు తగ్గాడు. తర్వాత అతడు ఆరోగ్యం మరింత మెరుగెందుకు వైద్యులు ఫిజియోథెరపీ చేయించారు. అలా దాదాపు 12 సంవత్సరాల తర్వాత అంటే 2023 చివరి నాటికి అతడు 63.5 కిలోల బరువుకు చేరుకున్నాడు. ఏకంగా 546.5 కిలోల బరువు తగ్గాడు. బరువు తగ్గిన తర్వాత ఇన్ని రోజులపాటు అదనంగా పెరిగిన అతడి చర్మాన్ని తొలగించేందుకు వైద్యులు అనేక రకాల శస్త్ర చికిత్సలు చేశారు. ప్రస్తుతం అతడు ఫిట్ గా ఉన్నాడు. బరువు తగ్గడంతో అతడు నవ్వుతూ కనిపిస్తున్నాడు. దీంతో అతనికి వైద్యులు స్మైలింగ్ పర్సన్ అనే బిరుదు ఇచ్చారు. అధికంగా బరువు ఉన్నప్పుడు ఖలీద్ తీవ్రంగా ఇబ్బంది పడేవాడు. శ్వాస తీసుకోవడం కూడా అతనికి కష్టం అయ్యేది. తినడానికి కూడా ఇబ్బంది పడేవాడు. మంచంలో పడుకుని ఉండటం వల్ల అతని వీపు భాగానికి గాయాలయ్యాయి. దీనికి తోడు చర్మం విపరీతంగా పెరగడంతో.. అనేక వ్యాధులతో సతమతమయ్యేవాడు. ఒకానొక దశలో చనిపోతే బాగుండు అనే నిర్ణయానికి వచ్చాడు. సౌదీ రాజు అతనిపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. చికిత్స అందేలా కృషి చేశారు. వాస్తవానికి ప్రపంచంలో ఈ స్థాయిలో బరువు తగ్గిన వ్యక్తి మరొకరు లేరు. బరువు తగ్గడం కోసం వైద్యులు చెప్పిన నిబంధనలను ఖలీద్ తూచా తప్పకుండా పాటించాడు. ప్రత్యేకమైన ఆహారం తీసుకున్నాడు. దాదాపు 11 సంవత్సరాల వరకు అతడి ఆహారంలో ఉప్పు, కారం, ఇతర దినుసులు ఉండేవి కావు. దుంపలు, కార్బోహైడ్రేట్లు ఇచ్చేవారు కాదు. కేవలం ప్రోటీన్ ఆహారం మాత్రమే.. అది కూడా మోతాదులోనే ఇచ్చేవారు. ఫిజియోథెరపీ కూడా అతడు బరువు తగ్గడానికి ఉపకరించింది.. బరువు తగ్గిన తర్వాత ఖలీద్ అత్యంత సంతోషంగా కనిపిస్తున్నాడు.. ప్రపంచాన్ని జయించినంత ఆనందం కలుగుతోందని పేర్కొంటున్నాడు. బరువు తగ్గిన తర్వాత అతని ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వ్యాప్తిలో ఉన్నాయి.

# రిటైర్మెంట్ ఆలోచన లేదు.. భారత్‌పై సిరీస్ గెలవడమే లక్ష్యం: ఆసీస్ స్టార్ బ్యాటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ వయసు ఇటీవలే 35 ఏళ్ళు దాటింది. ఆధునిక క్రికెట్ లో వన్ ఆఫ్ ది బెస్ట్ బ్యాటర్ గా పరిగణించబడే స్మిత్ పై రిటైర్మెంట్ వార్తలు వస్తున్నాయి. టీ20ల్లో స్థానం కోల్పోవడం.. వన్డేల్లో అడపాదడపా అవకాశాలు.. టెస్టుల్లో పేలవ ఫామ్. దీంతో ఈ ఆసీస్ బ్యాటర్ క్రికెట్ కు గుడ్ బై చెప్పాల్సిన సమయం వచ్చిందటున్నారు. అయితే తన రిటైర్మెంట్ పై వస్తున్న వార్తలను స్మిత్ కొట్టి పారేశాడు. తనకు అలాంటి ఆలోచనలు లేవని తేల్చి చెప్పాడు. రిటైర్మెంట్ పై స్టీవ్ స్మిత్ స్పందిస్తూ ఇలా అన్నాడు.. "ప్రస్తుతం నేను నా ఆటను ఆస్వాదిస్తున్నాను. చాలా రిలాక్సుగా ఉన్నాను. రిటైర్మెంట్ గురించి నాకు ఎలాంటి ప్రణాళికలు లేవు. సమ్మర్ లో జరగనున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోసం ఎదురు చూస్తున్నాను. భారత్ చాలా బలమైన జట్టు. ఈ సిరీస్ లో మాకు గట్టి ఛాలెంజ్ గా నిలుస్తుంది. ప్రపంచంలో రెండు అత్యుత్తమ టెస్ట్ జట్లు ఆడబోయే ఈ ట్రోఫీ కోసం ఎదురు చూస్తున్నాను". అని స్మిత్ చెప్పుకొచ్చాడు.

35 ఏళ్ల అతను 109 టెస్ట్ మ్యాచ్‌ల్లో 56.97 సగటుతో 9685 పరుగులు చేశాడు. కనీసం 5000 టెస్ట్ పరుగులు చేసిన బ్యాటర్‌లలో, బ్రాడ్‌మాన్ 99.94 తర్వాత ఆస్ట్రేలియన్‌లలో ఇది రెండో అత్యుత్తమ సగటు. డేవిడ్ వార్నర్ రిటైర్మెంట్ తర్వాత టెస్ట్ క్రికెట్‌లో ఓపెనర్‌గా స్మిత్ అవతారమెత్తాడు. ఎనిమిది ఇన్నింగ్స్ ల్లో 28 సగటుతో 171 పరుగులు మాత్రమే చేశాడు.

# టీమిండియాకు ఆడాలని ఉంది.. 43 బంతుల్లోనే భారత క్రికెటర్ సెంచరీ

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ తరపున టెస్టులో ట్రిపుల్ సెంచరీ ఒక్కసారిగా అందరి దృష్టి తనవైపుకు తిప్పుకున్నాడు కరుణ్ నాయర్. పేలవ ఫామ్ తో భారత జట్టులో స్థానం కోల్పోయిన ఈ కర్ణాటక ప్లేయర్.. మరోసారి సంచలన ఇన్నింగ్స్ తో మెరిశాడు. మహారాజా టీ20 ట్రోఫీలో భాగంగా కరుణ్ నాయర్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. మైసూర్ వారియర్స్ జట్టుకు కెప్టెన్ గా వ్యవహరిస్తున్న కరుణ్.. సోమవారం (ఆగస్టు 19) బెంగళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియంలో 43 బంతుల్లోనే సెంచరీ చేయడం విశేషం. మంగళూరు డ్రాగన్స్ బౌలింగ్‌పై పూర్తి ఆధిపత్యం చూపిస్తూ 48 బంతుల్లో 13 ఫోర్లు, 9 సిక్సర్లతో 124 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని స్ట్రైక్ రేట్ 258.33 గా ఉంది. కరుణ్ నాయర్ కెప్టెన్ ఇన్నింగ్స్ తో మైసూర్ డ్రాగన్స్ 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్ తర్వాత కరుణ్ నాయర్ భారత టెస్ట్ క్రికెట్ జట్టులో స్థానం సంపాదించడమే తన లక్ష్యమని చెప్పుకొచ్చాడు. కెరీర్ ప్రారంభంలోనే ఈ కర్ణాటక ప్లేయర్ భారత్ తరపున ట్రిపుల్ సెంచరీ చేసి సెహ్వాగ్ తర్వాత ఈ ఘనత సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన మైసూర్ డ్రాగన్స్ 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసింది. వర్షం కారణంగా మైసూర్ వారియర్స్ మంగళూరు డ్రాగన్స్ టార్గెట్ ను 14 ఓవర్లలో 166 పరుగులకు సవరించారు. లక్ష్య ఛేదనలో డ్రాగన్స్ 14 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 138 పరుగులకే పరిమితమైంది. దీంతో మైసూర్ డ్రాగన్స్ 27 పరుగుల తేడాతో గెలిచింది.



# గాయంతో స్టోక్స్ ఔట్.. కొత్త కెప్టెన్‌ను ప్రకటించిన ఇంగ్లాండ్ క్రికెట్



**హైదరాబాద్ పెన్ పవర్:** స్వదేశంలో ఇంగ్లాండ్ బుధవారం (ఆగస్టు 21) నుంచి శ్రీలంకతో మూడు టెస్టుల సిరీస్ ఆడనుంది. టెస్ట్ ఛాంపియన్ షిప్ లో భాగంగా ఇరు జట్లకు ఈ సిరీస్ కీలకంగా మారనుంది. ఈ సిరీస్ కు ఇంగ్లాండ్ జట్టు కొంతమంది స్టార్ ఆటగాళ్ల సేవలను కోల్పోయింది. ముఖ్యంగా బెన్ స్టోక్స్ గాయంతో ఈ సిరీస్ కు దూరం కావడం ఆ జట్టుకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. స్టోక్స్ స్థానంలో ఇంగ్లాండ్ కెప్టెన్ గా ఆలీ పోప్ జట్టుకు నాయకత్వం వహిస్తాడు. యువ క్రికెటర్ హ్యారీ బ్రూక్ వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. స్టోక్స్ తో పాటు జాక్ క్రాలీ ఈ సిరీస్ కు దూరమయ్యాడు అతని స్థానంలో డాన్ లారెన్స్ జట్టులో చేరాడు.

స్వదేశంలో ఇంగ్లాండ్ ఇటీవలే వెస్టిండీస్‌ను 3-0 తేడాతో చిత్తు చేశారు. అండర్సన్, బ్రాడ్ లేకపోవడం స్టోక్స్, క్రాలీ గాయాల కారణంగా దూరమవ్వడంతో కుర్రాళ్లతో నిండిన ఇంగ్లాండ్ జట్టు శ్రీలకంతో సిరీస్ ఛాలెంజ్ గా మారింది. బుధవారం (ఆగస్టు 21) మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ లో జరగనున్న తొలి టెస్టుకు ఇప్పటికే ఇంగ్లాండ్ ప్లేయింగ్ 11 ను ప్రకటించారు. మరోవైపు శ్రీలంక అండర్ డాగ్ గా ఈ మ్యాచ్ లో బరిలోకి దిగుతుంది. ఇంగ్లాండ్ ను వారి దేశంలో అడ్డుకొని నిలబడడం లంకకు అసాధ్యంగానే కనిపిస్తుంది.

**తొలి టెస్ట్ కు ఇంగ్లాండ్ ప్లేయింగ్ 11:**

డాన్ లారెన్స్, బెన్ డకెట్, ఒల్లీ పోప్ (కెప్టెన్), జో రూట్, హ్యారీ బ్రూక్ (వైస్ కెప్టెన్), జామీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, గస్ అట్కిన్సన్, మాథ్యూ పాట్స్, మార్క్ వుడ్, షోయబ్ బషీర్

## ఎల్లి అవ్రామ్ యొక్క అద్భుతమైన బ్లాక్ డ్రెస్ లుక్



# అనుపమ పారితోషికం డబుల్

జాక్ పాట్ కొట్టింది. స్పోర్ట్స్ డ్రామా కథలో అనుపమ పాత్రకు వెయిట్ ఉందని సమాచారం. ఇప్పటికే నెట్‌ఫ్లిక్స్‌తో స్ట్రీమింగ్ హక్కుల ఒప్పందం పూర్తయిందని తెలుస్తోంది. అలాగే 'లాక్ డౌన్' చిత్రానికి ఏఆర్ జీవా దర్శకత్వం వహిస్తున్నారు.

ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న 'JSK ట్రూత్ షాల్ ఆల్వేస్ ప్రైవైల్' అనే మలయాళ చిత్రంలోను అనుపమ నటిస్తోంది. 'పెట్ డిటెక్టివ్' అనే మరో తమిళ చిత్రంలో కూడా కనిపించనుంది. ఈ సినిమాకి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. అనుపమ తాజా చిత్రం టిల్లు స్క్వేర్ ప్రస్తుతం Netflixలో ప్రసారం అవుతోంది.



ఇటీవల అనుపమ పరమేశ్వరన్ గేమ్ మారిందని స్పష్టంగా అర్థమవుతోంది. ఈ క్యూట్ బ్యూటీ తన గేమ్‌లో ఉత్తమస్థానంలో ఉంది. మలయాళ చిత్రం 'ప్రేమమ్'తో తెరంగేట్రం చేసిన ఈ క్యూటీ గత 9 సంవత్సరాలుగా అన్ని సౌతిండియా చిత్రాలలో కనిపించింది. గత రెండు తెలుగు చిత్రాలైన కార్తికేయ 2 – టిల్లు స్క్వేర్ బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచాయి. అనుపమ నటించిన తమిళ చిత్రం సైరన్ కూడా విజయవంతమైంది. కార్తికేయ 2 తర్వాత అనుపమ మరోసారి నిఖిల్ సిద్ధార్థ్‌తో 18 పేజీస్ కోసం జతకట్టింది. ఇది సానుకూల సమీక్షలను అందుకుంది. ఈ విజయాలతో అనుపమ పరమేశ్వరన్ ఫేజ్ మారింది. తాజాగా టిల్లు స్క్వేర్ ఘనవిజయంతో అనుపమ స్థాయి మరింత పెరిగింది. టిల్లు గాని గాళ్ ఫ్రెండ్ పాత్రలో అనుపమ అద్భుతంగా నటించింది. మునుపటితో పోలిస్తే ఈ బ్యూటీలో గ్లామరస్ కంటెంట్ ఎలివేషన్ అదనపు హంగును జోడించింది. ఇటీవలి బాక్సాఫీస్ విజయాల దృష్ట్యా అనుపమ ఆలోచన మారిందని, నటిస్తున్న ప్రతి చిత్రానికి తన పారితోషికాన్ని రెట్టింపు చేసిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో ఒక్కో సినిమాకు లక్షల్లో అందుకునేది. ఇప్పుడు ఊహించనంత పెద్ద మొత్తం వసూలు చేస్తోందని గుసగుస వినిపిస్తోంది. అంతేకాదు.. అనుపమ కెరీర్ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఇప్పటికిప్పుడు కొన్ని చెప్పుకోదగ్గ చిత్రాల్లో ఈ బ్యూటీ నటిస్తోంది. టిల్లు స్క్వేర్ తర్వాత అనుపమ సన్నివేశాన్ని తెలివిగా ఎన్ క్యాష్ చేస్తోందనేది ఇన్ సైడ్ టాక్.

ఈ బ్యూటీ హనుమాన్ దర్శకుడు ప్రశాంత్ వర్మతో తదుపరి 'ఆక్టోపస్' అనే భారీ సినిమాలో నటించనుంది. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్ట్ గురించి పెద్దగా లీకులు అందలేదు. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో బైసన్ – లాక్‌డౌన్ అనే రెండు ప్రాజెక్ట్‌లు ఇటీవల ప్రకటించారు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ధృవ్ విక్రమ్ సరసన తమిళ చిత్రం బైసన్ లో అనుపమ

## వితిక షేరు ఫ్యాషన్ లక్ష్యాలను అధికం చేస్తోంది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com